ఉల్లాసంగా... ఉత్సాహంగా...

ఓపెన్ జిమ్‌లతో ప్రజలకు ఆరోగ్యం

నాడు వ్యాయామం చేయాలంటే ప్రైవేటు సంస్థలు నిర్వహించే జిమ్‌లకు వెళ్లాల్సి వచ్చేది. నెలా నెలా వేలాది రూపాయల ఫీజులు చెల్లించుకోవాల్సి వచ్చేది. అంతే కాకుండా దూరాభారం, వ్యయప్రయాసలు తప్పేవి కావు.

నేడు వ్యాయామం చేయాలంటే ఎక్కడెక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు.. ప్రజలకు అందుబాటులోని పార్కుల్లో ప్రత్యేకంగా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో వ్యయప్రయాసలు తగ్గాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో నచ్చినట్టుగా వ్యాయామం చేసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు.

- జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గాంధీపార్కులో రూ.4.6 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు
- వుడా కాలనీలోని ప్రగతి పార్కులో రూ.5 లక్షలతో వ్యాయామానికి అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశారు
- జీవీఎంసీ 75వ వార్డు పరిధి కోరాడలో గల మైదానంలో రూ.5లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు
- జీవీఎంసీ 65వ వార్డు పరిధి యాతపాలెంలో రూ.5 లక్షలతో జిమ్ ఏర్పాటు చేశారు



ఇది కదా అభివృద్ధి

పెదగంట్యాడ : ఉరుకులు పరుగుల జీవితంలో నగరవాసికి విశ్రాంతి దొరకడం లేదు. ఫలితంగా మానసిక ఒత్తిళ్లకు లోనై అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ సమస్య నుంచి బయటపడేందుకు వ్యాయామమే కీలక మార్గమని వైద్యులు, మానసిక నిపుణులు సైతం సూచిస్తున్నారు. రోజులో కొంత సమయం వ్యాయామం చేయడం తప్పనిసరి అని చెప్పడంతో ప్రజలతా ఇప్పుడు శారీరక శ్రమపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రశాంతంగా, ఉచితంగా వ్యాయామం చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ప్రజల అవసరాలకు తగిన విధంగా పార్కుల్లో ఖర్చుకు వెనుకాడకుండా ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. వీటిలో జనం ఉదయం, సాయంత్రం ఉత్సాహంగా వ్యాయామం చేసుకుంటూ గడుపుతున్నారు. ఆపై అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం పొందుతున్నారు.



75వ వార్డు కోరాడలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆట పరికరాల వద్ద చిన్నారుల సందడి



ఖర్చు లేకుండా ఆరోగ్యం

ఇక్కడ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో రోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తున్నాను. దీని వల్ల ఖర్చు తగ్గింది. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదు. ఇక్కడి జిమ్ సౌకర్యంగా ఉంది. పిల్లలు కూడా వ్యాయామానికి అలవాటు పడ్డారు.

– సోమరాజు, నడుపూరు, 76వ వార్డు



దూరాభారం తగ్గింది

గతంలో నెల్లిముక్కు నుంచి ఇతర ప్రాంతాలకు వ్యాయామం కోసం వెళ్లేవాడిని. దీని వల్ల సమయం సరిపోకపోవడంతో క్రమం తప్పేది. ప్రస్తుతం మా ఇంటి సమీపంలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడంతో ఉదయం, సాయంత్రం వ్యాయామం చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– నాగరాజు, నెల్లిముక్కు, 75వ వార్డు



ఎక్కువ సమయం వ్యాయామం

రోజూ వేకువజామునే నిద్రలేచి ప్రైవేటు సంస్థలు నిర్వహించే జిమ్‌కు వెళ్లేదాన్ని. కానీ అప్పటికే అక్కడ జనంతో నిండిపోయి ఉండేది. అధిక సమయం వ్యాయామం చేసుకోవడానికి కుదిరేది కాదు. ప్రస్తుతం మా ఇంటి వద్ద పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఎక్కువ సమయం వ్యాయామం చేసుకుంటున్నాను.

– గొల్లవిల్లి భాగ్యలక్ష్మి, వుడా కాలనీ



వుడా కాలనీలోని ప్రగతి మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో సాధన చేస్తున్న కాలనీవాసులు

క్లుప్తంగా

నిత్య అన్నసమారాధన ప్రారంభం



అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న దొడ్డి రమణ

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నిత్య అన్నసమారాధన ప్రారంభించారు. పోలరాజు, రాజరాజేశ్వరి దంపతుల ఆర్థిక సాయంతో సోమవారం అన్నసంతర్పణను శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దొడ్డి రమణ ప్రారంభించారు. అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం వడ్డించారు. చిప్పాల అప్పలరాజు, ఎర్రిబిల్లి పైడిరాజు, కొవిరి బాపనయ్య, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన సాయి నామస్మరణ



సాయి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అగనంపూడి షిర్డీసాయిబాబా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ఏకాహం నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు ఆలయంలో భక్తులు ఓం సాయి.. శ్రీసాయి... జయ జయ సాయి నామ స్మరణతో భక్తిపర్వశంలో మునిగిపోయారు. 24 గంటల పాటు భక్తులు సాయి నామాన్ని స్మరిస్తూ గీతాలాపాన చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ సారథ్యంలో కమిటీ ప్రతినిధులు జి.శంభుడు, పి.రామారావు, పీఎల్ఎస్ రాజు, పి.సత్యనారాయణ, కె.అరుణ, డి.సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, లీలావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే సహించం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా అన్నింటిని ఎదుర్కొంటామని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తుంటే చూస్తూ ఊరుకోమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1019వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన టీపీఆర్, ఆర్ఈడీ, తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కును అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు, కార్మికులు వచ్చే ఎన్నికల్లో గట్టి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణా ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రజాస్వామ్యాన్ని బతికించాలని తెలంగాణా ప్రజలకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ



సరుకులు అందిస్తున్న శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడికి చెందిన శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందజేశారు. నిర్వాసిత కాలనీకి చెందిన నిరుపేద ఎం.లక్ష్మణమ్మ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న సంఘ సభ్యులు గందోళి అప్పలకొండ, నాగేంద్రరావు, సత్యనారాయణమూర్తి తన తండ్రి సోమరాజు పేరుతో నెలకు సరిపడా బియ్యం, ఇతర వస్తువులు అందించారు.

టీడీఆర్‌లు సకాలంలో అందించేలా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : రోడ్ల విస్తరణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. దువ్వాడ స్టేషన్ రోడ్ విస్తరణలో తొలగించాల్సిన భవనాలకు టీడీఆర్‌ల మంజూరుపై ఆయా భవన యజమానులతో గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్న సమయంలో కొంతమందికి తాత్కాలిక ఇబ్బంది కలిగే అవకాశం ఉందని, దాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని కోరారు. రోడ్డు విస్తరణ కోసం భవనాలు కోల్పోనున్న అందరికీ సకాలంలో టీడీఆర్‌లు అందే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. తమకు టీడీఆర్‌లు అందజేసిన ర్వాత రోడ్డు విస్తరణ చేపట్టాలని, రోడ్డు కొలతల విషయంలో రీ సర్వే నిర్వహించాలని పలువురు భవన యజమానులు పట్టుబట్టారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన భవనాలకు సంబంధించి ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకొంటున్నామన్నారు. అందరికీ టీడీఆర్‌లు చెల్లించిన తర్వాతే తొలగింపు ఉంటుందన్నారు. దీనికోసం త్వరలోనే ఒక ప్రకటన విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, వార్డు నాయకుడు వాడపల్లి రామచంద్రరాజు, టీపీవో రేవతి తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధే ధ్యేయం



65వ వార్డు భానోజీతోటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అన్ని వార్డుల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని భానోజీతోట, కేఎల్ రావు నగర్, వాంబే కాలనీ, టీఎస్ఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో రూ.79.21 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, కాలువలు, కొండవాలు ప్రాంతాల్లో మెట్లు నిర్మించనున్నామని చెప్పారు. కొండవాలు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, జీవీఎంసీ జోన్–6 జోనల్ డీఈ అప్పారావు, నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం,మంగునాయుడు, ఇరోతి గణేష్, జుత్తు లక్ష్మీ, మంత్రి మంజుల పాల్గొన్నారు.

జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్ నగర్ లోవ, పాత సంగం పాక వద్ద రూ.40లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దయాల్‌నగర్ లోవలో రూ.20లక్షలతో రోడ్డు, కాలువలు నిర్మించనున్నామన్నారు. పాత సంగం పాక వద్ద రూ.20 లక్షలతో రోడ్డు, కాలువలు నిర్మిస్తామని తెలిపారు. చకచకా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు గోవింద్, లోకేష్, పీకే నాయుడు, నాగరాజు, ఒమ్మి ఈశ్వరి, రెడ్డి, రాజాన నాయుడు, సత్యనారాయణ, దొడ్డి నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

విమర్శలకు తావులేకుండా ఓటర్ల సర్వే



బీఎల్‌వోల నుంచి వివరాలు సేకరిస్తున్న రాష్ట్ర రోల్ పరిశీలకుడు శ్యామలరావు

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర రోల్ అబ్జర్వర్ జె.శ్యామలరావు 68వ వార్డు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బీఎల్‌వోలతో సోమవారం సమావేశమయ్యారు. అక్కిరెడ్డిపాలెం సచివాలయాలకు చెందిన బీఎల్‌వోల నుంచి అనేక అంశాలపై వివరాలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు ప్రక్రియ, ఇంటింట సర్వే, ఏరియా సరిహద్దుల్లో ఓటర్ల వివరాలు, నమోదు ప్రక్రియలో రిజిస్ట్రేషన్ విధానం వంటి అంశాలను పరిశీలించారు. ఓటర్ల సర్వేను ఎక్కడా విమర్శలకు తావులేకుండా నిర్వహించాలని బీఎల్‌వోలకు ఆయన సూచించారు. అనంతరం స్కూల్‌లో బూత్‌లను పరిశీలించారు. తరగతి గదుల్లో ఓటింగ్ సరిగే విధానాన్ని పరిశీలించారు. విద్యుత్ సరఫరాను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో హుస్సేన్ సాహేబ్, గాజువాక ఓటర్ల నమోదు ప్రత్యేక అధికారి లక్ష్మారెడ్డి, 8 మంది అక్కిరెడ్డిపాలెం సచివాలయాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గాజువాక కొత్త ఎస్ఐల బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్ | హరి కృష్ణ

అక్కిరెడ్డిపాలెం: గాజువాక లా అండ్ ఆర్డర్ ఎస్ఐలుగా శ్రీనివాస్, హరికృష్ణ బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరు వన్‌టౌన్‌లో పోలీస్ స్టేషన్ నుంచి గాజువాకకు బదిలీపై వచ్చారు. గాజువాక లా అండ్ ఆర్డర్ నుంచి కొల్లి సతీష్, ఎం.రవికుమార్ నగరానికి బదిలీ అయ్యారు.

హోరెత్తిన పంచాక్షరి మంత్రం

కిటకిటలాడిన శైవక్షేత్రాలు



పూజలందుకుంటున్న ఉమారామలింగేశ్వరుడు

పెదగంట్యాడ: కార్తీక మాసం రెండో సోమవారం పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. హరహర మహాదేవ నామస్మరణతో హోరెత్తించారు. భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తులసికోట, ధ్వజస్తంభం, నందీశ్వరుని వద్ద దీపారాధన చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా ఆలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ జి.రవికృష్ణరాజు, నాయుడుబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కె.షణ్ముఖ శివకుమార్, సీహెచ్ సోమునాయుడు పాల్గొన్నారు. 76వ వార్డులోని బాలచెరువు ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ పంచాయతన ఆలయంలో పరమేశ్వరునికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. వుడా కాలనీ, గాంధీనగర్‌లోని శివాలయంలో పార్వతీ పరమేశ్వరులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆయా ఆలయాల్లో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. అలాగే శివలింగం, ఓం తదితర రూపాలతో కూడిన దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. కార్తీక మాసం రెండో సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో శివాలయాల్లో పూజలు చేశారు. వేకువజామునే భక్తులు ఆలయాలకు వెళ్లి ధ్వజ స్తంభాల వద్ద దీపారాధన నిర్వహించారు. రాంనగర్, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, ఆటోనగర్, మింది తదితర ప్రాంతాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. కార్తీకమాసం రెండో సోమవారంతోపాటు పౌర్ణమి కూడా కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. సెక్టార్ – 6 శివాలయంలో, బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో, రవీరేస్ సమీప పురాతన శివాలయంలో వేకువజాము నుంచి పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. త్రిశక్తి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.



బాలచెరువులోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



ఉక్కు త్రిశక్తి దేవాలయంలో జ్యోతిర్లింగార్చన

ఘనంగా సహస్ర దీపాలంకరణ సేవ

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైన తిరుమల బాలాజీకు సహస్ర దీపాలకరణ సేవ, స్వామివారి పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కార్తీక మాసం పౌర్ణమి అత్యంత విశేషమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీతిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శత్రుఘ్నుడికి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న శత్రుఘ్నుడు

గాజువాక : అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్(ఆశ్రా) ఏపీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు శత్రుఘ్నుడిని ఉత్తమ సేవల అవార్డు వరించింది. ఈ మేరకు ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన ఆశ్రా 5వ జాతీయ సమ్మిట్‌లో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్, తెలంగాణ రెరా చైర్మన్ ఎన్.సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేసిన ఆశ్రా నిర్వాహకులకు శత్రుఘ్నుడు ధన్యవాదాలు తెలిపారు.

భెల్ ఈడీతో భేటీ



ఈడీ జితేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: భెల్(హెచ్‌పీవీపీ) విశాఖపట్నం యూనిట్‌కు కొత్తగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పదోన్నతి పొందిన ఎస్.జితేందర్‌రెడ్డిని సోమవారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వంగా కలిశారు. ఆయనకు అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం పలు సమస్యలపై ఈడీకి విన్నవించుకున్నారు. సంస్థ ఆవరణలో బిర్సా ముండా, బుద్ధ విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. డి గ్రేడ్ అయిన వాళ్లకి గ్రేడ్ లిఫ్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, సంస్థ డీజీఎం మధుసూధనరావు, ప్రతినిధులు బి.రాజ్‌కుమార్, డి.సాయిబాబు, హెచ్.భోగేష్, పి.విశ్వసరావు, సామ్యూల్, టి.దావీదు, జయప్రకాష్, రవి నాయక్, ఉమాపతి, బి.సునీత్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా గిరి ప్రదక్షిణ



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో భక్తులు, అర్చకులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 6 గంటలకు ప్రారంభమైన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, హరి స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.